రక్షణకు కాటమయ్య కిట్లు



ఆస్నాదలో కాటమయ్య కిట్టుపై శిక్షణ ఇస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

- ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గీత కార్మికులకు ఉచిత శిక్షణ
- ఉత్తీర్ణత సాధించిన వారికే కిట్లు అందజేత

చెన్నూర్‌రూరల్: కల్లు గీత కార్మికులు ఎత్తయిన తాటిచెట్లు ఎక్కి కల్లుగీసి అమ్ముకుని జీవనం సాగిస్తుంటారు. కానీ అంత ఎత్తయిన చెట్లు ఎక్కిన సమయంలో మోకుతాడు తెగడం లేదా అనుకోకుండా జారిపడడమో జరిగితే మృత్యువాత పడి కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రస్తుతం నూతనంగా కల్లుగీత కార్మికులు తాటి చెట్లు ఎక్కేందుకుగానూ కాటమయ్య కిట్లను రూపొందించారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గీత కార్మికులకు కిట్లపై శిక్షణ ఇచ్చి ఉచితంగా అందజేస్తున్నారు.

శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన వారికి కిట్టు

గీత కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని 1500ల కిలోల బరువును సైతం అవలీలగా అదిమి పట్టుకునే విధంగా ఆరు పరికరాలతో కాటమయ్య కిట్టును తయారు చేశారు. ఎంతో ఎత్తులో ఆకాశానికి దగ్గరగా ఉన్నట్లు కనిపించే విధంగా ఉన్న తాటిచెట్టు ఎక్కిన గీత కార్మికుల ప్రాణాలకు రక్షణగా ఈ కిట్టు ఉపయోగ పడనుంది. ఎన్ఐటీ నిట్ అప్రూవల్‌తో అధునాతన సాంకేతికతో కిట్లను తయారు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దశల వారీగా శిక్షణ ఇచ్చి అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి కిట్టు అందజేస్తున్నారు. ఒక్కో కిట్టు విలువ సుమారు రూ.15వేల వరకు ఉంటుంది. ఇందులో రోప్(మోకుతాడు), క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్‌బ్యాగ్, లేక్ లూప్స్ వంటి ఆరు పరికరాలు ఉన్నాయి. వెనకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఎక్సైజ్‌శాఖ పరిశీలనలో గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్నారు. మొదటి విడతగా మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 250 మందికి, రెండవ విడతలో 258 మందికి శిక్షణ ఇచ్చి అందులో ఉత్తీర్ణత సాధించిన 189 మంది గీత కార్మికులకు కిట్లను అందజేశారు.



కాటమయ్య కిట్టు

కిట్టుతో ప్రయోజనాలు

తాటి చెట్టు ఎక్కుతున్న సమయంలో గీత కార్మికుడు తడబాటు పడినా కిట్టులోని పరికరాలు కార్మికుని శరీరాన్ని స్థిరంగా ఉంచుతాయి. ఊహించని విధంగా ప్రమాదంలో చిక్కుకున్నప్పటికి 30 నుండి 40 అడుగుల ఎత్తుకు వెళ్లిన కార్మికుడు ప్రమాదం నుండి బయట పడే విధంగా ఈ పరికరాలు ఉపయోగ పడతాయి. తేలిక పాటి రక్షణ సామగ్రి కావడంతో సహజంగా కదలడానికి ఉపకరిస్తుంది. తాటి చెట్టు ఎక్కే వారి మోకాళ్లు, వెన్ను, కాళ్ల ఆరోగ్యంగా ఉండే విధంగా ఈ పరికరాలు పని చేయనున్నాయి. గీత కార్మికులు 80 శాతం ప్రమాదాల బారిన పడకుండా తయారు చేసిన కిట్లు తేలిగ్గా ఉండి కార్మికులకు ఉపయోగకరంగా ప్రాణాలకు రక్షణగా నిలుస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

శిక్షణ ఇచ్చి కిట్టు ఇస్తున్నారు



కాటమయ్య కిట్టు ఇచ్చేందుకు ముందుగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో నెగ్గితేనే కిట్టు అందిస్తున్నారు. కిట్టులో మంచి పరికరాలు ఉన్నాయి. ప్రమాదాలు జరగకుండా కిట్టు ఉపయోగపడుతుంది.

– కంబగోని రాజాగౌడ్, కొమ్మెర

ప్రత్యేక శిక్షణ



కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇప్పించి ఉచితంగా కాటమయ్య కిట్లు అందజేయడం జరుగుతుంది. కిట్టులో ఆరు పరికరాలు ఉంటాయి. ఈ కిట్టుతో కార్మికులకు ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉండవు. – ఎం.హరి, ఎక్సైజ్ సీఐ, చెన్నూర్

అందరి దృష్టి జాబితాపైనే..!

- ఇందిరమ్మ కమిటీ సభ్యులు అప్రమత్తం
- ఇల్లు రద్దుకు వినతిపత్రం

సాక్షి స్పందన

బెల్లంపల్లి: ''ఇందిరమ్మ' ఎంపిక పారదర్శకంగా జరిగేనా!' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. ఏ మాజీ ప్రజాప్రతినిధి తన భార్య పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించుకున్నారనే విషయం చర్చనీయాంశంగా మారింది. బెల్లంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నియమించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు అప్రమత్తం అయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను రెండ్రోజుల క్రితమే మున్సిపల్ కమిషనర్‌కు అందజేయాల్సి ఉండగా జాప్యం జరుగుతోంది. మరికొద్ది మార్పులు, చేర్పులతో ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మున్సిపాల్టీకి చెందిన ఓ నాయకుడు తన అనుయాయులను పురమాయించి తమకు అనుకూలమైన వ్యక్తుల పేర్లకు వార్డుల వారీగా చోటు కల్పించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో అధికారికంగా ప్రకటించనున్న లబ్ధిదారుల జాబితాపైనే అందరి దృష్టి నెలకొంది.

మరికొందరి పేర్లు వెలుగులోకి..

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు, అనర్హుల పేర్లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా మున్సిపల్ ఓ ముఖ్య మాజీ ప్రజాప్రతినిధి పేరిట ఇల్లు మంజూరు కావడం మరో విశేషం. ఆ మాజీ ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహించిన వార్డులో అర్హులకు చోటు కల్పించలేదని తెలుస్తోంది. బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల్లోని జాబితాల్లోనూ కొందరు ముఖ్యుల పేర్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభాకర్

ఇల్లు రద్దుకు వినతిపత్రం అందజేత

తన భార్య బండి ఉమాదేవి పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో బెల్లంపల్లి మున్సిపల్ 13వ వార్డు మాజీ కౌన్సిలర్ బండి ప్రభాకర్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రద్దు చేయాలని కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావుకు నతి పత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల జాబితా నుంచి పేరు తొలగించి అర్హులకు కేటాయించాలని కోరారు.

ప్రజల భద్రతకు కమ్యూనిటీ పోలీసింగ్

కోటపల్లి: ప్రజల భద్రత కోసం కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహిస్తున్నామని ఎస్సై రాజేందర్ అన్నారు. సోమవారం అన్నారంలో కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్, సైబర్ నేరాలు, అసాంఘిక శక్తులు, శాంతి భద్రతలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్టు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్సై వెంకటేశ్, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న ఎస్సై రాజేందర్

'అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

వేమనపల్లి: మంగెనపల్లిలో ఇటీవల యజమాని వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న నాయిని కన్నయ్య మృతికి కారకులైన ఎనగంటి చిన్నన్న, భార్య లక్ష్మి, కుమారుడు హరీష్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకురాలు మర్మల మల్లేశ్వరి అన్నారు. టీఏజీఎస్ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు బుయ్యారం ప్రధాన రహదారిపై సోమవారం స్థానిక గిరిజనులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామయ్య, బుచ్చయ్య, బాయక్క, దుర్గక్క పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

చెన్నూర్: నాయిని కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం చెన్నూర్ ఏరియా కార్యదర్శి బొడెంకి చందు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్యామల, ఉమారాణి, బొడ్ల సరిత, నాగజ్యోతి, సిడం సమ్మక్క, రేణుక, రాజేశ్వరి, ఎల్లమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్‌లో సీపీఎం నాయకుల నిరసన

దండేపల్లి: అగ్రవర్ణ కుటుంబం వేధింపులతో మృతి చెందిన వేమనపల్లి మండలానికి చెందిన నాయిని కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని మాకులపేట జీపీ పరిధిలోని రామునిగూడెంలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్లా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నృసింహున్ని దర్శించుకున్న సీనియర్ సివిల్ జడ్జి

ధర్మపురి: ధర్మపురిలోని లక్ష్మీనృసింహస్వామిని మంచిర్యాల సీనియర్ సివిల్ జడ్జి అర్పిత సోమవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆమె స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొని నిత్యాన్నదానం కోసం రూ.5వేలు అందజేశారు. ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'భూభారతి'పై అవగాహన సదస్సు

కోటపల్లి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంపై కోటపల్లి రైతువేదికలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాఘవేంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కుమార్ దీపక్ హాజరవుతారని, మండలంలోని రైతులు, నాయకులు అధికసంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

'ప్రజావాణి' సద్వినియోగం చేసుకోవాలి

భీమారం: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రజలనుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు పోటీపడాలి



విద్యార్థులతో ఎంఈవో చిన్నయ్య

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందించడంలో ఉపాధ్యాయులు పోటీపడాలని ఎంఈవో చిన్నయ్య అన్నారు. మండలంలో మొదటిసారిగా ద్వారక ప్రాథమిక పాఠశాలలో 'గ్యాడ్యుయేషన్ సెర్మో' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఐదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రాథమిక విద్యా పట్టా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం చిననర్సయ్య, హెచ్‌ఎం నీరటి సురేశ్, సీఆర్పీ ఇప్ప సురేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చు

దండేపల్లి: విద్యార్థులు కష్టపడి చదివితే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం పాఠశాలలో రోల్‌మోడల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న లింగాపూర్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థిని బానవత్ వనజ ఇటీవల గ్రూప్–1లో మంచి ర్యాంకు సాధించడంతో శాలువాతో సత్కరించారు. అనంతరం దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

'సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

పాతమంచిర్యాల: సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంచార జాతుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వైద్య భాస్కర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 56 బీసీ కులాలు ఉంటే వారిలో 10 శాతం సంచార జాతులకు చెందిన వారు ఉన్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వారికి అందడం లేదన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అత్యంత వెనుకబడి ఉన్న సంచార జాతుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు శాఖపురి భీంసేన్, శ్రీపతి రాములు, కొత్తకొండ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలకు 170 మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు సోమవారం 170 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతిలో 504 మంది విద్యార్థులకు గాను 438 మంది హాజరు కాగా 66 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 928 మందికి గాను 824 మంది హాజరుకాగా 104 మంది గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు ఎనిమిది పరీక్ష కేంద్రాలు తనిఖీ చేశారని డీఈవో యాదయ్య తెలిపారు.

సమాజ నిర్మాణంలో సాహిత్యం కీలకం

మంచిర్యాలఅర్బన్: సమాజ నిర్మాణంలో సాహిత్యం కీలకమని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక సరస్వతీ శిశు మందిర్‌లో సాహితి సంరక్షణ సమితి, సంగీత సాహిత్య సుధావాహిని సంస్థల ఆధ్వర్యంలో చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, శతవధాని ఎంవీ పట్వర్ధన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు వామన్‌రావు, శ్రీనాథ్‌గౌడ్, బొనగిరి రాజిరెడ్డి, శీలక్ష్మి, రాజేశంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



పట్వర్ధన్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

ప్రభుత్వ పాఠశాలలో స్నాతకోత్సవాలు

మందమర్రిరూరల్: పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్నాతకోత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న 32 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రత్యేకతను తెలిపే కరపత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులు ఆవిష్కరించారు. అనంతరం 'మతం కంటే మానవత్వమే గొప్ప' అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ చారీ, ఉపాధ్యాయులు భీమ్ పుత్ర శ్రీనివాస్, ఉమాదేవి, లలిత, రవి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్రమశిక్షణతో పనిచేయాలి



నియామకపత్రం ఇస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: యువ ఉద్యోగులు క్రమశిక్షణతో పని చేయాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం టీ.శ్రీనివాస్ అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలో 19 మంది యువతీ, యువకులకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలన్నారు. చిన్న చిన్న కారణాలతో డ్యూటీలకు ఎగనామం పెట్టవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, పీఎం రాజేశ్వర్‌రావు, వీటీసీ మేనేజర్ వెంకట రామారావు, సీనియర్ పీవో కాంతారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఏసీసీ3, గౌతమి నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో అనుబంధ పోషక ఆహారం, పిల్లల ఎదుగుదలపై వాటి ప్రభావం, పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్.పద్మ, శారద, పద్మావతి, జయ, ఏఎన్‌ఎంలు నాగలక్ష్మి, రాజేశ్వరి, ఆర్పీ అమీనా, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

జన్నారం: పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సోమవారం రేండ్లగూడ 2 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం జరిపించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ ఆరోగ్యలక్ష్మి పథకం కింద అందించే ఒకపూట సంపూర్ణ భోజనాన్ని వినియోగించుకోవాలన్నారు. వెయ్యి రోజుల సంరక్షణ, రక్తహీనత, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, ప్రమీల, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో 'ఏక్ భారత్ శ్రేష్టా భారత్'

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఏక్ భారత్ శ్రేష్టా భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు హర్యానా రాష్ట్రం వస్త్రధారణ, సంస్కృతి సంప్రదాయాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా ఎంఈవో వెంకటేశ్వరస్వామి మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని సంస్కృతికి ప్రతీక గా ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరీ, జ్యోతి, మాధవిలత, తదితరులు పాల్గొన్నారు.



హర్యానా రాష్ట్ర వస్త్రధారణలో విద్యార్థులు

ఆదివాసీలకు న్యాయం చేయాలి



గ్రీవెన్స్‌లో విన్నవిస్తున్న మడావి వెంకటేశ్వర్

కాసిపేట: మండలంలోని దేవాపూర్ సిమెంట్ కంపని యాజమాన్యాలు ఆదివాసీలకు న్యాయం చేయాలని దేవాపూర్‌కు చెందిన మడావి వెంకటేశ్వర్ సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు విన్నవించారు. దేవాపూర్‌లో 1980లో సికె బిర్లా రూ.46కోట్లతో ఓరియంట్ సిమెంట్ కంపనీ ప్రారంభించారన్నారు. ప్రస్తుతం సికె బిర్లా గ్రూప్ కంపనీలో 42శాతం వాటా రూ.8100 కోట్లకు ఆదాని గ్రూప్‌కు విక్రయించడం జరిగిందన్నారు. బిర్లా గ్రూప్ 3శాతం, ఆదాని గ్రూప్ 2శాతం వాటాను ఆదివాసీలకు ట్రస్టు ఏర్పాటు చేసి కేటాయించాలని కోరారు.

ఎస్సై నాగరాజుకు వీడ్కోలు

జైపూర్: జైపూర్ పోలీస్ స్టేషన్‌లో రెండో ఎస్సైగా విధులు నిర్వర్తించి ములుగు జిల్లాకు బదిలీపై వెళ్తున్న నాగరాజుకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, స్థానిక ఎస్సైలు శ్రీధర్, సంతోశ్, సిబ్బంది శాలువాలతో సత్కరించారు.

కార్యవర్గం ఎన్నిక

లక్సెట్టిపేట: రెడ్డి సంక్షేమ సంఘం మండల కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా పాలమాకుల సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ముస్కు రత్నాకర్‌రెడ్డి, రాజ్‌కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోడ సతీశ్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా సంతోష్, వినోద్‌రెడ్డి, ఆదిరెడ్డి, అనంతరెడ్డి, ప్రచార కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, మల్లారెడ్డి, కోశాధికారిగా కేతిరెడ్డి బుచ్చిరెడ్డి, సలహాదారులుగా జగన్మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భూమారెడ్డి, చుక్కా రెడ్డి, బాపురెడ్డిని ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పదవీ విరమణ సన్మానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిలువురు మణికుమార్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.హన్మాండ్లు మణికుమార్ సేవలు కొనియాడారు.

వేతనాలు సకాలంలో ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతీనెల 5న వేతనాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందజేశారు. వేసవికాలం దృష్ట్యా పనిదినాన్ని మధ్యాహ్నం 12 గంటల వరకు తగ్గించాలని, ప్రతి కార్మికునికి కార్పొరేషన్ ఐడీ కార్డు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు గోవర్ల ఆశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద సాగర్, ఆవునూరి లింగయ్య, ఆవుల శ్రీనివాస్, చిప్పకుర్తి లింగయ్య, ఆత్మకూరి తిరుపతి, లక్ష్మీనారాయణ, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి మూడు దరఖాస్తులు

తాండూర్: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి భూతగాదాలకు సంబంధించిన మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్ సీఐ కుమారస్వామి, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్: మందమర్రిలో సింగరేణి బొగ్గు గనులు మూత పడుతున్న నేపథ్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందిపాట రాజు సోమవారం ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రిలో సింగరేణి గనులు మూతపడటంతో యువత నిరుద్యోగులుగా మారుతారని, దీంతో నిరుద్యోగ సమస్య పెరుగుతుందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని నిరుద్యోగ సమస్యను తీర్చడానికి పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: వేసవి సెలవుల్లో జిల్లా కేంద్రంలోని సైన్స్‌కేంద్రంలో విజ్ఞాన శాస్త్రాలపై ఉచిత సైన్స్ శిబిరం నిర్వహించనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి సైన్స్ సమ్మర్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 12 రోజుల పాటు, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు రాజమ్మ, ఉపాధ్యక్షులు సతీశ్, శ్రీనివాస్, శంకర్, సుదర్శన్‌గౌడ్, వేణు పాల్గొన్నారు.

ఎర్లీబర్డ్ స్కీం సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు ఎర్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శివాజీ సూచించారు. ముందస్తు పన్ను చెల్లించి 5 శాతం రిబేటు పొందాలన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన మధుసూదన్‌రెడ్డి సోమవారం ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ముందస్తు పన్ను రూ.3,05,938 చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల కేంద్రం పరిధిలోని పశువులకు సోమవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువుల యజమానులు తమ పశువులకు టీకాలు వేయించి రాబోయే వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారిణి డాక్టర్ శాంతిరేఖ సూచించారు. ఈ సందర్భంగా 94 గేదెలు, 76 ఆవులకు టీకాలు వేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు నారాయణ, గోపాలమిత్ర రవి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కాసిపేట: మండలంలోని కోమటిచేనుకు చెందిన కుమ్మరి రాజయ్య, లక్ష్మి దంపతుల కూతురు శివప్రియ వివాహానికి ఎమ్మెల్యే వినోద్ అందించిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని సోమవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రత్నం ప్రదీప్, నేతకాని సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దుర్గం గోపాల్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాంటెంకి శ్రీనివాస్, జాడి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : విజయ్ ప్రశాంత్ - 9440208447
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899